# మాధవీలత

వరుసగా వేసుకొన్న జడలో మల్లె పువ్వులు మెరుస్తున్నయ్. ఆ మల్లెల సువాసన మైమరచి చూస్తున్న లత తనకు తెలియకనే తీయని తలపుల్లో మునిగింది.

క్రిందటేడు బి. ఎస్‌సి. పరీక్షలు వ్రాసి పిన్ని బాబాయిల దగ్గరకు వెళ్లాలని హుషారుగా బయలుదేరింది లత. ఒకే కూతురవటం వల్ల గారాబం ఎక్కువ. అందుచే ఆమె తల్లిదండ్రులు ఒంటరి ప్రయాణానికి అడ్డు పెట్టలేదు. గుమ్మంలో అడుగుపెట్టగానే మూర్తి "అమ్మా! అక్కయ్యొచ్చిందే. ఈ తడవైనా రాయలేదేమే" అంటూ లోపలికి లాక్కెళ్లాడు. హాల్లో అడుగుపెట్టిన లత ఒక్కసారిగా దిగ్భ్రాంతి చెందింది.

మాధవి శివరంజనీ రాగ గీతికను శ్రావ్యంగా వీణమీద వాయిస్తోంది. ఆమె కెదురుగుండా సోఫాలో ఒక అపరిచిత యువకుడు అతని ప్రక్కనే బాబాయి గోపాలరావుగారూ ఉన్నారు. అప్పటి పరిస్థితినిబట్టి విషయం అర్థంచేసుకున్న లత లోపలికి వెళ్ళబోతూంటే బాబాయి "రామ్మా లతా" అని దగ్గరకు పిలిచి కుశల ప్రశ్నలు వేసి "ఈయన కాబోయే అల్లుడు. మద్రాసులో ఇంజనీరుగా పనిచేస్తున్నారు" అని పెళ్ళికొడుకు మధుని పరిచయం చేశారు. మధు, లతతో చాలా చనువుగా మాట్లాడాడు. అతని మాటలనుబట్టి అతనికి తెలుగు సాహిత్యమంటే అభిమానం ఎక్కువ అని గ్రహించింది లత. వాటిపై ఇద్దరికీ వాదోపవాదాలు జరిగినయ్. పెళ్ళిచూపుల సందర్భమైనా లత మాట్లాడటం పిన్నికి ఏమాత్రం నచ్చలేదు. ఇదంతా గమనిస్తున్న బాబాయి "మా లతకి వాదించటం అంటే చాల ఇష్టం. సరైనవారు దొరికితే ఓపట్టాన వదలదు" అన్నారు.

అందుకు మధు "నాకూ మీ లత వాదన ఎంతో నచ్చిందండీ. ఇటువంటివి నాకెంతో సరదా" అన్నాడు.

* * *

పెళ్లిచూపులవగానే మాధవి ఆ చోటి నుండి గబగబా మేడమీదికి పరుగెత్తింది. మొదట లతకి తనతో మాటాడలేదని కోపం వచ్చినా, సిగ్గుచేత పరుగెత్తుతోం దనుకుని ఆమెను అనుసరించింది. చివరిమెట్టు ఎక్కుతున్న లత, మాధవి ఎవరితోనో ఫోన్లో మాట్లాడటం విని అక్కడే ఆగింది.

"హలో! ఎవరూ! రఘురామేనా? పెళ్లివారు వచ్చి వెళ్ళారు. అందరూ ఈ సంబంధానికి ఒప్పుకున్నట్లే. మీరు మీ తల్లితో చెప్పలేరు మా అమ్మా నాన్నని మాస్టేనే నసు వాడలేం. ఎలా" అన్న మాధవి కంఠం వినిపించింది.

"లాయరు జగన్నాథంగారి అబ్బాయి మధుసూదన్" అంది మాధవి.

"మధు మీ అన్నయ్యా? నిజమేనా రఘూ! కాళ్ల క్రిందున్న భూమి పగిలి నన్ను తనలో ఇముడ్చుకొన్నా బాగుణ్ణు. నేనెంత దురదృష్టవంతురాలిని" అంటూ కన్నీరు కారుస్తూ ఫోన్ పెట్టేసి తనగదిలోకి దూరింది మాధవి. లతకి విషయం అర్థమైనా పూర్తిగా తెలియలేదు. ఆమె మాధవి గదిలోకి ప్రవేశించింది. లతని చూడగానే మాధవి కళ్లు తుడుచుకుంటూ "రా లతా కూర్చో" అంది. లత మాధవిని తనవేపు త్రిప్పుకొని "మాధవీ! రఘూ ఎవరు?"

## పి. మధుమంజరి

మాధవి సంభ్రమించిపోయింది.

"లతా నే మాట్లాడిందంతా విన్నావా? ఒద్దు. నీతో చెప్పి మాత్రం ప్రయోజనం ఏమిటి? నా రాత అలా వుంది" అంటూ లత భుజంమీద తల ఆన్చి వెక్కి వెక్కి ఏడ్చింది మాధవి.

"మాధవీ! విషయం తెలియక నేను చేసేదేముంది. నా వల్లైన సహాయం చేస్తాను, చెప్పు" అని ఓదార్చింది లత.

రఘు, మాధవి క్లాస్‌మేట్‌లని, వారిద్దరూ ప్రేమికులని, మధు రఘు అన్నయ్య అని తెలుసుకొంది లత.

"మాధవీ! పిన్ని బాబాయిలతో చెపితే" అంది లత.

"వారు తాపట్టిన కుందేలికి మూడే కాళ్ళంటారు. ప్రేమా లేదు. గీమా లేదు. మధునే చేసుకోమంటారు వారితో వాదించి లాభం లేదు" వెంటనే లత "మాధవీ మధు ఫోన్ నంబర్ నాకు ఇవ్వు. ఆ పని నే చూసుకుంటాలే" అంది ఏదో నిశ్చయానికి వచ్చినదానికి మల్లే.

* * *

మరునాడు లత తన స్నేహితురాలింటికి వెళతానని చెప్పి బయలుదేరింది. మధుకి ఫోన్ చేసి అతనితో అతి ముఖ్య విషయం మాట్లాడాలని అతనికి వీలుగా ఉంటే కృష్ణా బారేజ్ వద్ద కలుసుకోమని కోరింది. అతనూ అందుకు అంగీకరించాడు.

కృష్ణా బారేజ్ వద్ద ప్రకృతిసౌందర్యాన్ని తిలకిస్తోంది లత. కృష్ణ తన కెరటాలతో ఉవ్వెత్తుగ ప్రవహిస్తూ సముద్రుణ్ణి చేరడానికి ఉరకలు పరుగులు త్రొక్కుతూంది. ఆ సమయంలో లత హృదయంలో కూడా తాను చేపట్టిన ఈ సమస్యనుండి సుఖంగా ఒడ్డుకు చేరగలనా అన్న సందేహం కలిగింది. సంధ్యాసమయపు అరుణ కిరణాలు కృష్ణానదికి మరింత శోభను కూరుస్తున్నయ్. అట్టి మనోహర దృశ్యంలో మైమరచి నుంచున్న లత "హలో లతా" అన్న పిలుపువిని ఈ లోకంలోకి వచ్చింది. మధు నుంచుని ఉన్నాడు.

"మీ సంతోషానికి భంగం కలిగిస్తున్నానేమో" అన్నాడు.

"అదేంలేదు మీ రిప్పుడే వచ్చారా?"

"ఔను అతి ముఖ్య విషయం అన్నారు. ఏవిటో"

"మీ వ్యక్తిగతవిషయాలలో జోక్యం కలుగచేసుకోవలసిన అవసరం వచ్చింది. క్షమించండి. నాకూ మాధవికి బాల్యస్నేహం స్నేహం ఎక్కువ. అందువల్లే ఆమెజీవితాన్ని సుఖమయం చేయమని మిమ్మల్ని కోరడానికి వచ్చాను."

"అసలు విషయం చెప్పండి. దానికింత ఉపోద్ఘాతం ఎందుకు." లత ధైర్యంచేసి అన్నీ చెప్పి రఘూ, మాధవిల మధ్య అతను అడ్డంగా ఉండరాదని కోరింది. ఆమె మాటలను విని మధు చిరునవ్వు నవ్వాడు. అది చూసి లత నిర్ఘాంతపోయింది.

"ఎందుకలా నిర్ఘాంతపోతారు? రఘు నావద్ద ఏదీ దాచడు. నిన్న రాత్రి అతను అన్నీ నాతో చెప్పాడు. ఇక రఘు మాధవీల వివాహానికి అమ్మతో చెప్పి ఏర్పాట్లు చేయిస్తాను," అన్నాడు నవ్వుతూ. లత ఒక్కసారిగా మధు రెండుచేతులూ పట్టుకొని "మధూ మీలాటి ఉన్నతాభిప్రాయాలుండటం చాలా అరుదు. నే చేపట్టిన సమస్య ఇంతత్వరగా పరిష్కరించినందుకు ఎంతో సంతోషంగా వుంది" అంది ఉద్వేగంతో.

ఆమె తెప్పరిల్లి మధుచేతులను తను పట్టుకొని ఉండటం చూసి గబుక్కున వదిలిపెట్టింది.

మధు ఆమెవైపు చూసి చిన్నగా నవ్వాడు.

ఆ చూపుతో లత ముకుళించిన పద్మంలా సిగ్గుతో తలొంచుకుంది.

"ఇప్పటికే లేట్ అయింది. మాధవి కోసమైనా నేను తొందరగా వెళ్ళొద్దూ" అంది లత తలొంచుకునే.

"అబ్బో ఏం సిగ్గు! నా కారులో ఎక్కు. డ్రైవ్ చేస్తాను" అంటూ కారువైపు నడిచాడు మధు. లత అతన్ని అనుసరించింది.

* * *

లత కార్లోంచి దిగడం చూసిన పిన్ని కోపం పట్టలేక "అమ్మాయ్ లతా! నువ్విలా తిరగడం బాగాలేదు. ఇప్పుడు మధుతో తిరిగి మాధవి జీవితం పాడు చేయాలనుకుంటున్నావా. అయినా దానికి మంచి సంబంధం కుదరటం నీ కెందుకంత కష్టం" అంటూ పెద్ద ఉపన్యాసం ప్రారంభించింది పార్వతమ్మ. లత నిర్లక్ష్యంగా మాధవిగదిలోకి దూరింది.

"ఔరా" అని విస్తుపోయింది పార్వతమ్మ.

లతని చూడగానే మాధవి "లతా ఏమైంది. మధు ఏమన్నాడు?" అని ఆతృతగా ప్రశ్నించింది మాధవి.

"నేనువెళ్తే ఆ కార్యం జరక్కుండా ఉంటుందా" అంటూ అన్నీ ఆమెతో చెప్పి "నేనొక నాటకమాడా లనుకుంటున్నాను. నీవేమీ అడ్డు చెప్పకూడ"దంటూ ఆమెతో ఏదో చెప్పింది. మాధవిముఖం విప్పారింది.

లత గబగబా పిన్ని దగ్గరకెళ్ళి "పిన్నీ! ఇదిగో ఇవి చూడు" అంటూ కొన్ని ఉత్తరాలను ఆమె ముందుంచింది.

"ఏం ఉత్తరాలు లతా"


ఇవన్నీ మాధవి రఘులు వ్రాసుకొన్న లేఖలు రఘు ఎవరో తెలుసా? మీరు కాబోయే అల్లుడనుకొన్నారే మధు! ఆయన తమ్ముడు ఇప్పుడు ఈ విషయం మధు చెవిని సోకితే అతను మాధవిని పెళ్లి చేసుకుంటాడా ఇందాక నన్ను విచ్చలవిడిగా తిరుగుతున్నానన్నారే. అమాయకురాలనుకున్న మీ అమ్మాయిని చూడండి" అంది లత గట్టిగా.

"లతా గట్టిగా మాట్లాడకు పైకి పొక్కిందంటే దాని జీవితం పాడవుతుంది." అంది విచారంతో పిన్ని.

"పిన్నీ! నువ్వెందుకింత బాధపడతావు. వారిద్దరికీ ఒకరిపై ఒకరికి అనురాగం ఉన్నప్పుడు నువ్వు మాధవికి బలవంతంగా మధుతో వివాహం జరిపిస్తే తనేం సుఖపడుతుంది" అంది లత.

"అవును లతా అది నిజమే" అని కొంచెం సేపాగి "నేను రామమ్మగారితో మాట్లాడి వస్తాను" అంది.

"నువ్వూ నేనూ అనుకుంటే సరా, పెద్ద



చిత్రం: శ్రీమతి ఆర్. రుక్మిణీబాయి.

బ్బాయికి పెళ్ళిచేయక చిన్నబ్బాయికి చేస్తారా?' అని ఓ సమస్య లేవదీసింది లత.

పార్వతమ్మకి ఏంచేయాలో తోచలేదు.

కొంతసేపు అటూ ఇటూ తిరిగింది. ఆమె కేదో ఆలోచనతట్టింది. వెంటనే లతవైపు తిరిగి "అదంతా నీ కెందుకు లతా నే చూసుకుంటా, నువ్వెళ్ళి ఫోంచెయ్యి" అంది. నవ్వుకుంటూ తనపాచిక పారినందుకు సంతోషిస్తూ తృప్తిగా నవ్వింది లత.

ఆ మరునాడు పార్వతమ్మ మధువాళ్ళింటికి వెళ్ళి రామమ్మగారితో రఘుకి మాధవికీ ఉన్న ప్రేమను చెప్పింది. మధ్యలో రామమ్మగారు అందుకొని 'వదినా నాకు అన్ని విషయాలు తెలుసు. మధు నిన్న నాతో అన్నీ చెప్పాడు. నేనే మీ యింటికే బయలుదేరుతున్నాను. ఇంతలో అడవోయిన తీర్థం ఎదురైనట్లు మీరే వచ్చారు" అంది సంతోషంగా.

పార్వతమ్మ లోలోపల సంతోషించింది. 'అయితే మధు పెళ్ళివిషయం ఏంచేస్తారండీ" అంది.

"మధుకి లత ఎంతో నచ్చిందట. ఆ అమ్మాయికీ ఇతనంటే ఇష్టంలాగుంది. నిన్న వీడి విషయం వాడు, వాడి విషయం వీడు బయట పెట్టారు. వాళ్ళ నాన్న ఇంత ఆస్తినీ, ఈ యిద్దరినీ వదిలి వెళ్ళిపోయారు. ఆయనకు వారి పెళ్లి చూసే భాగ్యం లేదు. అయినా పిల్లల ఆశ పాడు చేయడం నాకిష్టంలేదు. ఇక లత తల్లి తండ్రులకు తెలియజేస్తే ఒకే పందిట్లో రెండు పెళ్ళిళ్ళూ జరపొచ్చు. ఏమంటావు వదినా" అంది రామమ్మ.

"అంతా శుభంగా గడిస్తే, మనకింక కావలసిందేముంది" అంది పార్వతమ్మ తృప్తిగా తనకోర్కె నెరవేరినందుకు ఆనందిస్తూ.

* * *

పెళ్లిపందిరి బంధుజనంతో కలకలలాడుతూంది.

మధు, లత, మాధవి రఘు, స్నేహితుల చిలిపి చేష్టలకు తట్టుకోలేక పోయ్యారు. మధు స్నేహితుడొకడు వారిని పలుకోణాల్నుండి ఫోటోలుతీశాడు. పెళ్ళి వైభవంగా జరిగింది. ఆ మరునాడు మాధవి మల్లెపందిరివద్ద పట్టె మంచంమీద పడుకొని మల్లెల సువాసనల ననుభవిస్తూ ఏదో ఆలోచిస్తూ తనలో తాను నవ్వుకుంటోంది.

అప్పుడే ప్రవేశించిన లత "మాధవి కలలు కంటున్నావా. కోరిన పురుషుణ్ణి వరించి అతను దగ్గరుండగా ఇంకా కలలెందుకూ. అయినా ఇదంతా నేను లేకుంటే జరిగేదా? ఇంత కథకీ నాయకురాల్ని నేనేకదా" అంది గర్వంగా.

అంతా విన్న మాధవి "ఓస్ గొప్ప ఘనకార్యం చేశావు లే. నీకూ స్వార్థం ఉంది కాబట్టే నువ్వు నాకు సాయపడ్డావు. నాకోసం వెళ్ళి నీకు వరుణ్ణి వెతుక్కున్నావే," అంది మరింత గర్వంగా లతను దెప్పిపొడుస్తూ.

"రఘు, మధు లనే ఆధారమే లేకుంటే ఈ మాధవీలతలకు ఆ సొగసు, గర్వం ఏది" అన్నాడు వారి మాటలను వింటూ వచ్చిన మధు. అతన్ని చూడగానే ఇద్దరూ లేచి నుంచోని తలొంచుకున్నారు. క్రొత్త పెళ్లి కూతుళ్ళు కదా మరి.

* * *

గడియారం పది గంటలు కొట్టింది. ఆలోచనలోనుండి తేరుకొన్న లత ఉలిక్కిపడి లేచింది. 'అరె సినిమాకి వెడదాం రెడీగా ఉండమని ఆయన చెప్పి వెడితే తాను ఈ మధుర స్వప్నాలలో పడి మరిచిపోయానే' అని నొచ్చుకుంటూ తొందరగా డ్రెస్సింగ్ రూమ్ వైపు నడిచింది లత. ★